నేడు విధుల్లోకి పార్వతీపురం సబ్ కలెక్టర్

పార్వతీపురం, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా అసుతోష్ శ్రీవాత్సవ మంగళవారం విధుల్లో చేరనున్నారు. ఈ మేరకు అధికార వర్గాలు అన్ని ఏర్పాట్లు చేశారు. కొవ్వూరు నుంచి బదిలీ పై వస్తున్న ఆయన సబ్ కలెక్టర్‌గానే కాకుండా పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా వ్యవహరించనున్నారు. సబ్ కలెక్టర్‌గా శ్రీవాత్సవ నియామకమై చాలా రోజులైనప్పటికీ పశ్చిమ గోదావరి జిల్లాలో వరదల కారణంగా ఆలస్యంగా ఇక్కడకు వస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఆర్డీవో హేమలతకు ఎక్కడ పోస్టింగ్ అన్నది ఇంకా తెలియరాలేదు.

ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యం

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

పార్వతీపురం, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి) / బెలగాం: ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. లాంఛనంగా ప్రారంభమైన విశాఖ-దుర్గ్ వందేభారత్ రైలుకు పార్వతీపురంలో హాల్ట్ ఇవ్వడంతో సోమవారం బెలగాం రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఉత్తరాంధ్ర అంటే వెనుకబడిన ప్రాంతం కాదు. అభివృద్ధిలో సత్తాచాటి ఉత్తరాంధ్రను ఆంధ్రప్రదేశ్‌కు ముఖద్వారంగా చేద్దాం. త్వరలోనే రైల్వే జోన్ ఏర్పాటవుతుంది. మరి కొద్ది నెలల్లో భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తవుతాయి. జంఝావతి ప్రాజెక్టుకు సంబంధించి ఒడిశాతో ఉన్న సమస్యను పరిష్కరించి పూర్తిస్థాయిలో రైతులకు సాగునీరు అందిస్తాం. పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తాం. ఉత్తరాంధ్రలో వలసలను నిర్మూలిస్తాం. పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వంటి నాయకుల ఆధ్వర్యంలో ఏపీ అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తున్నాం. వందే భారత్ రైలుకు పార్వతీపురంలో హాల్ట్ ఉండే విధంగా ఎమ్మెల్యే విజయచంద్ర ఎంతో కృషి చేశారు. ముందు ప్రకటించిన షెడ్యూల్‌లో పార్వతీపురంలో ఆ రైలుకు హాల్ట్ లేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే విజయచంద్ర మా దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే రైల్వే సహాయ మంత్రితో మాట్లాడి హాల్ట్ కల్పించేలా చర్యలు తీసుకున్నాం. హాల్ట్ విషయంలో ఎమ్మెల్యే కృషి అభినందనీయం.' అని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ ' కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో పార్వతీపురం నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. గతంలో దివంగత నేత కె.ఎర్రంనాయుడు ఈ ప్రాంతానికి తాగునీటితో పాటు రహదారుల అభివృద్ధికి ఎంతో సాయం చేశారు.' అని తెలిపారు. రైల్వే శాఖ ద్వారా ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన మంత్రిని కోరారు. అనంతరం కేంద్రమంత్రిని ఘనంగా సన్మానించారు. వందే భారత్ రైలు ఏసమయానికి, ఎంత వేగంతో వస్తోందనేది స్టేషన్ మాస్టర్లు శ్రీనివాస్‌రావు, ప్రసాద్ తదితరులు వివరించారు. ఈ సమావేశంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి , కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, రైల్వే డీఆర్ఎం సౌరబ్, ఆ శాఖ అధికారి మురళీకృష్ణ పట్నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ గౌరీశ్వరి, వైద్యులు వివేక్, మోహన్‌రావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి వినతులు

జంఝావతి ప్రాజెక్టును పూర్తి చేయించాలని, కొమరాడ మండలం గంగురాయివలసలో రైల్వే హాల్ట్ కల్పించాలని, సాగు, తాగునీటితో పాటు రైల్వే సమస్యలను పరిష్కరించాలని పలువురు కేంద్రమంత్రికి వినతి పత్రాలు ఇచ్చారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్రీరాములు, లైన్స్‌క్లబ్ అధ్యక్షుడు బీఎంటీ రావు, ప్రతినిధి పి.సూర్యారావు , ఏపీ ఎన్జీవో సంఘం నాయకుడు కిషోర్ తదితరులు మంత్రిని సన్మానించి, పలు సమస్యలపై వినతిపత్రాలు అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు వెంకటేష్, కె.నారాయణరావు, వెంకట నాయుడు, చంద్రమౌళి, సీతారాం, రౌతు వేణు, పి.వేణు గోపాల నాయుడు, మధుసూదనరావు, సుధ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్, ఎస్పీ, రైల్వే శాఖాధికారులు తదితరులు

స్వచ్ఛతా హి సేవకు సన్నద్ధం: కలెక్టర్



పార్వతీపురం, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా నేటి నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా 17న మానవహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, ఆరోగ్య సంరక్షణ సేవలు, 18న స్వచ్ఛత పరుగులు, బ్లీచింగ్, దోమల నివారణ మందుల పిచికారీ, 19న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞలు, డంప్‌ల గుర్తింపు, తొలగింపు, పారిశుధ్య కార్మికులకు మంజూరైన పథకాలతో అనుసంధానం వంటివి చేయాలని వివరించారు. 20న మొక్కల పెంపకం, 21న అవగాహన ర్యాలీలు, పరి శుభ్రతపై డ్రైవ్, పార్కులను శుభ్రపర్చడం, 22న మిషన్ లైఫ్ ప్రచారాలు, 23న వర్షపు నీటి నిల్వ, నిర్మాణాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచిం చారు. 24న తాగునీటి నిర్మాణాల శుభ్రత, 25న నాట కాలు, మార్కెట్లను శుభ్రపర్చడం, 26న అవాంఛిత యాప్‌ల తొలగింపు, 27న గ్రామ, వార్డుల సభల నిర్వహణ, 28న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ల సుందరీకరణ, 29న చెత్తను సృష్టించే ఆర్ట్ శానిటేషన్ పార్కులపై అవగాహన, 30న మూలాల విభజన, అక్టోబరు 1న విద్యా సంస్థల్లో స్వచ్ఛ హ్యాక్‌థాన్ల నిర్వహణ వంటివి ఉంటాయని తెలిపారు. ప్రజలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్స్, పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థలు భాగస్వాములు కావాలని సూచించారు.

నేడు పాలకొండలో మెగా జాబ్‌మేళా

పాలకొండ సత్యసాయి డిగ్రీ కళాశాలలో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్, ఎంఎస్సీ పాసైన వారు, 18 నుంచి 30 సంవత్సరాల లోపు యువతీ యువకులు అర్హులన్నారు. 16 కంపెనీల ప్రతినిధులు 1050 పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబి

పార్వతీపురంటౌన్/కురుపాం/సాలూరు రూరల్, సెప్టెంబరు 16 : మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా జిల్లాలో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబి వేడుకలను నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచే ముస్లింలు మసీదుల్లో జాగరణ చేశారు. సోమవారం ఉదయం పార్వతీపురం, కురుపాం, సాలూరులో భారీగా ర్యాలీలు నిర్వహించారు. భక్తిగీతాలు పాడుతూ, మహ్మద్ ప్రవక్తని కొనియాడుతూ.. మక్కా మసీద్ నమూనాను ఊరేగించారు. మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మసీదుల్లో ప్రత్యేక నమాజ్, ప్రార్థనలు చేశారు. కొందరు దానాలు చేశారు. పలుచోట్ల అన్నదానాలు ఏర్పాటు చేశారు. మహ్మద్ ప్రవక్త సూచించిన సన్మార్గంలో పయనించాలని మత పెద్దలు పిలుపునిచ్చారు.


కురుపాంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


సాలూరు మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు


పార్వతీపురంలో ర్యాలీగా వెళ్తూ..

మరో రెండు ఉంటే మేలు

- భామిని నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే కష్టమే..
- జిల్లాలో అదనంగా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని ప్రజల విన్నపం

పార్వతీపురం, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇసుక నిల్వ కేంద్రాలు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం భామిని మండలంలో స్టాక్ పాయింట్ ఉండగా.. అక్కడ నుంచి ఇసుక తెచ్చుకోవడం కష్టసాధ్యంగా మారింది. అక్కడ వంశధార వరద కాలువ ముఖద్వారం కాట్రగడ్డ బీ వద్ద మేటలు వేసే ఇసుకను తవ్వి స్టాక్ పాయింట్‌కు తరలించడానికి ఇటీవల కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. అయితే ఈ నిల్వ కేంద్రం నుంచి భామిని, పాలకొండ, సీతంపేట మండలాల వారు సులభంగా ఇసుకను తెచ్చుకునే వీలుంది. జిల్లాలో పార్వతీపురం, కురుపాం, సాలూరు వాసులు అక్కడి నుంచి ఇసుకను తెచ్చుకోవాలంటే వ్యయ ప్రయాసలకు గురవ్వాల్సి వస్తోంది. దూరాభారం కావడంతో రవాణా చార్జీలు తడిసిమోపెడవుతున్నాయి. ఈ నేపథ్యంలో సాలూరు, పార్వతీపురం నియోజకవర్గాల్లో రెండు ఇసుక స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. అదేవిధంగా కొమరాడలోనూ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఐదేళ్లూ.. చెల్లించలే!

- గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం
- గిరిజన రైతులకు అందని పశు బీమా
- పరిహారం కోసం ఎదురుచూపు
- కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని విన్నపం



సీతంపేట రూరల్, సెప్టెంబరు16: పాడి రైతుల సంక్షేమం కోసమే వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు గత వైసీపీ ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రకటించింది. అయితే పరిహారం చెల్లింపుల్లో మాత్రం చేతులెత్తేసింది. దీంతో గత ఐదేళ్లుగా గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిహారం సొమ్ము కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. 2019-2024 మధ్య కాలంలో సీతంపేట మండలంలో పలు గిరిజన గ్రామాల్లో ఆవులు, మేకలు , గేదెలు, గొర్రెలు మృతి చెందాయి. దీంతో అప్పటి పశు సంవర్థక శాఖ అధికారులు వైఎస్సార్ పశు బీమా పథకం కింద రైతుల వివరాలను నమోదు చేసి క్లయిమ్‌ల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపారు. మొత్తంగా 22 క్లయిమ్‌లకు గాను రూ.5.25 లక్షలను సంబంధిత రైతుల ఖాతాల్లోకి జమ కావల్సి ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల కాలంలో కేవలం మూడు క్లయిమ్‌లకు గాను రూ.75 వేలు మాత్రమే చెల్లించింది. మిగిలిన 19 క్లయిమ్‌లకు సంబంధించి రూ.4.50లక్షలు చెల్లించలేదు. దీంతో నేటికీ గిరిజన రైతులు పశు బీమా నగదు కోసం సీతంపేటలోని పశు సంవర్థక శాఖ కార్యాలయం చుట్టు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వాస్తవంగా ఈ పథకం కింద చనిపోయిన ముర్రా గేదెకు రూ.30 వేలు, నాటు గేదెకు రూ.15 వేలు, నాటు ఆవుకు రూ.15 వేలు, జెర్సీ, సంకర జాతి ఆవుకు రూ.30 వేలు, గొర్రె, మేకకు ఒక్కో దానికి రూ.6 వేల చొప్పున పరిహారం చెల్లించాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వం గిరిజన పాడి రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం సొమ్ము అందించలేదు. దీంతో వారంతా కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ సమస్యను పరిష్కరించి. ఆర్థికంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

గత ప్రభుత్వానికి నివేదించాం



వైఎస్సార్ పశు బీమా పథకం కింద ఇంకా 19 మందికి నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంది. పెండింగ్‌లో ఉన్న గిరిజన రైతుల క్లయిమ్‌ల విషయాన్ని ఎన్నో సార్లు అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఏ ప్రయోజనం లేదు. 22 క్లయిమ్‌లకు గాను కేవలం ముగ్గురికి మాత్రమే నష్టపరిహారం అందింది.

- శ్రీనివాసరావు, ఏడీ, పశు సంవర్థక శాఖ

ఘనంగా ఏలాం వినాయకుని నిమజ్జనోత్సవం



పాలకొండ: పట్టణంలోని ఏలాం జంక్షన్‌లో కొలువుదీరిన 13 అడుగుల భారీ మట్టి వినాయకుని నిమజ్జనోత్సవాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. బండ్ల వేషాలు, కోలాటాలు, శక్తివేషాలు, అఘోరా, బిందెలు, సవర డ్యాన్స్‌లు, బ్యాండ్ మేళాలు, తప్పెటగుళ్ల ప్రదర్శన, డీజే పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాలకొండ పురవీధుల మీదుగా ఊరేగింపు సాగగా.. సంకిలిలోని నాగావళి నదిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

కొండను తవ్వి.. రోడ్డు వేసి..


- ఏవోబీలో ఇసుక ర్యాంప్‌ల కోసం మార్గం ఏర్పాటు
- యథేచ్ఛగా కంకర తరలింపు
- ఆంధ్ర పరిధిలో జరుగుతున్నా.. పట్టించుకోని అధికారులు
- మండిపడుతున్న గ్రామస్థులు

భామిని: భామిని మండలంలో నది పరివాహక ప్రాంతంలోని ఒడిశా భూభాగంలో ఇసుక ర్యాంప్‌లకు వెళ్లేందుకు కొత్తగా రహదారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఎటువంటి అనుమతి లేకుండా ఆంధ్ర పరిధిలో ఉన్న బురజోలకు సమీపంలో కొండను తవ్వడం చర్చనీయాంశమవుతోంది. యథేచ్ఛగా గ్రావెల్‌ను తరలిస్తున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. బురజోల కొండ నుంచి ఏబీ రోడ్డు వయా పసుకుడి మీదుగా సింగిడి సమీపంలో వంశధార నదీ తీరంలో ర్యాంపునకు వెళ్లేందుకు వీలుగా కొండను తవ్వి... రోడ్డు ఏర్పాటు చేస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు మౌనం దాల్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా కొందరు ఒడిశా ప్రతినిధులతో స్థానిక ఆంధ్రా నేతలు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు వంశధార నది పరివాహక ప్రాంతంలోని ఒడిశా భూభాగం భామిని (ఆంధ్రా) మండలంలోని పసుకుడి, తాలాడ, దిమ్మిడిజోల, బిల్లుమడ, నేరడి తదితర గ్రామాలకు ఆనుకుని ఉంది. ఇదంతా ఒడిశాదేనని ఆ రాష్ట్ర అధికారుల వాదన. అందుకే బిల్లుమడ, నేరడి, పసుకుడి ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలకు వారు అనుమతి ఇచ్చారు. అయితే ఇదే అదునుగా కొందరు ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని కొంతమంది రాజకీయ నాయకులతో కలిసి ఇసుక దందా సాగించేందుకు యత్నిస్తున్నారు. ఇసుక తవ్వకాలు, రవాణాకు ఒడిశాల అనుమతులు ఉన్నాయంటూ బరితెగిస్తున్నారు. అసలు భామిని మండలంలోని కంకర తవ్వకాలకు అనుమతులు లేవు. అలాంటిది బురజోల కొండపై కంకర తవ్వకాలు చేపట్టి.. వంశధార నది నుంచి ఇసుక తరలించేందుకు వీలుగా రోడ్డు నిర్మాణాలు చేపడుతుండడంతో పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖరంను వివరణ కోరగా.. కంకర తవ్వకాలకు సంబంధించి తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.


ట్రాక్టర్లతో గ్రావెల్‌ను తరలిస్తూ..


బురజోల సమీపంలో ఉన్న కొండపై తవ్వకాలు చేపట్టిన దృశ్యం

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి క్యాట్



దరఖాస్తు గడువు తేదీ సెప్టెంబరు 20కి పొడిగింపు

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన పరీక్ష 'కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)' దరఖాస్తు గడువు తేదీని పొడిగించారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించే క్యాట్‌లో సాధించిన పర్సంటైల్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ఇతర ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. ఈ ఏడాది పరీక్షను దేశవ్యాప్తంగా 170 నగరాల్లో నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, బోధ్ గయా, కోల్‌కతా, ఇండోర్, జమ్ము, కాశీపూర్, కోజికోడ్, లఖ్‌నవూ, నాగ్‌పూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు కేటాయించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూస్ నిర్వహించి తుది ఎంపికను చేపడతాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 20

అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: నవంబరు 5 నుంచి 24 వరకు

పరీక్ష తేదీ: నవంబరు 24

ఫలితాల ప్రకటన: జనవరి రెండో వారంలో

వెబ్‌సైట్: https://iimcat.ac.in/

దిక్సూచి DIKSUCHI

ఎన్‌జీ రంగా వర్సిటీలో ఎన్ఆర్ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేసే వీలుంది.



స్పెషలైజేషన్‌లు

అగ్రికల్చర్: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రోబయాలజీ, సాయిల్ సైన్స్, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఆగ్రోనమీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్, ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్, ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ.

కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్): ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జూమర్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్.

సీట్ల వివరాలు: పీజీ ప్రోగ్రామ్‌లో 53 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కోదానిలో రొటేషనల్ బేసిస్ మీద 6 సీట్లు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 41 సీట్లు కేటాయించారు.

- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో 14 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కో దానిలో రొటేషనల్ బేసిస్ మీద ఒక సీటు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 12 సీట్లు కేటాయించారు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్) 2024-25 విద్యా సంవత్సరానికి గాను వివిధ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గడువు తేదీని పొడిగించింది. మొత్తం 22 పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఆల్ ఇండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ద్వారా సీట్లను భర్తీ చేస్తారు. హైదరాబాద్, భువనేశ్వర్, కొచ్చి, పట్నా, ఢిల్లీ, గువాహటి, కోల్‌కతాల్లో ప్రవేశ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

స్పెషలైజేషన్లు - సీట్లు

- ఇంగ్లీష్-6, తెలుగు-19, ఉర్దూ-3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్-8, హిస్టరీ-8, పొలిటికల్ సైన్స్-10, సోషియాలజీ-20, ఆంత్రోపాలజీ-9, ఎడ్యుకేషన్-2, రీజనల్ స్టడీస్-5, ఇండియన్ డయాస్పోరా-2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ-4, జెండర్ స్టడీస్-5, ఎకనామిక్స్-28, డ్యాన్స్-3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్-1, కమ్యూనికేషన్-3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్-4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్-8, హెల్త్ సైన్సెస్: ఆప్టోమెట్రి-2, మెటీరియల్స్ ఇంజనీరింగ్-16, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ-4.
- ఇంతకు ముందు(నోటిఫికేషన్ తేదీ 2024 జూన్ 3) దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరల దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.


అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.550; ఓబీసీ-ఎన్‌సీఎల్ రూ.400; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ(పీహెచ్) అభ్యర్థులకు రూ.275.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **హాల్ టిక్కెట్స్ డౌన్‌లోడ్:** అక్టోబరు 10
- **ప్రవేశ పరీక్ష తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** నవంబరు 18
- **ఇంటర్వ్యూలు :** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** డిసెంబరు 2
- **అడ్మిషన్ కౌన్సిలింగ్ తేదీలు:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 1
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in/

నవ్య | చిత్రజ్యోతి

బీస్ట్ మోడ్ ఆన్



బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్ ఓ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'ఆర్‌సి16' అనేది వర్కింగ్ టైటిల్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉందీ చిత్రం. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా, రామ్‌చరణ్ ఓ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసి ఈ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశారు. "బీస్ట్ మోడ్ ఆన్. ఆర్‌సీ 16 లోడింగ్" అని పేర్కొన్నారు.

ఓనమ్ పర్వదినం సందర్భంగా 'కూలీ' సినిమా సెట్స్‌లో సూపర్‌స్టార్ రజనీకాంత్ స్టెప్పులేశారు. ఆయన నటిస్తున్న 'వేట్టయాన్' సినిమాలోని 'మానసిలాయో' పాటకు స్టెప్పులేసి ఆయన చిత్రబృందంలో జోష్ తెచ్చారు. ఈ సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతున్న సంగతి తెలిసిందే.











వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి హీరో సాయిదుర్గ తేజ్ విరాళంగా ప్రకటించిన రూ. పది లక్షలు, హీరో విష్వక్‌సేన్ రూ పది లక్షలు, నిర్మాత సూర్యదేవర నాగవంశీ రూ. 25 లక్షలు, హాస్యనటుడు ఆలీ దంపతులు రూ. 3లక్షల చెక్కులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంతరెడ్డికి అందజేశారు.

ఇన్ ప్రోగ్రెస్

జైలుకి వెళ్లిన గొర్రె



సుహాస్ హీరోగా నటించిన యూనిక్ ఎంటర్‌టైనర్ 'గొర్రె పురాణం' ఈ నెల 20న విడుదల కానుంది. పురాణం బాబీ దర్శకత్వంలో ప్రవీణ్‌రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నా పేరు రామ్.. అలియాస్ యేసు. గొర్రె జైల్లో ఉండడం ఏందీ.. ఆడికెల్లి తప్పించుకోవడం ఏంది? ఇదంతా మీకు వింతగా ఉంది కదూ' అనే వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ మొదలైంది. ఒక గొర్రె ఓ గ్రామంలో రెండు మతాల మధ్య చిచ్చు పెట్టిన నేపథ్యాన్ని చాలా ఆసక్తికరంగా ప్రజెంట్ చేశారు. పోసాని కృష్ణమురళి, రఘు కీలక పాత్రలు పోషించారు.

మహిళల రక్షణ కోసం



ప్రవీణ్ కె.వి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహీష'. యషిక, పృథ్వీరాజ్, వైష్ణవి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు కొండా విజయ్‌కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్ బాగుంది. మహిళల రక్షణ కోసం చేసిన చిత్రమిది" అని చెప్పారు. "ధర్మాన్ని ఎలా కాపాడాలో ఇందులో చూపిస్తున్నాం. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి" దర్శకుడు, హీరో ప్రవీణ్ కె.వి అన్నారు.

తిన్నడి స్నేహితుడు




విష్ణు మంచు నటిస్తున్న 'కన్నప్ప' నుంచి ప్రతి సోమవారం వస్తున్న అప్‌డేట్లు సినిమా మీద అంచనాలు పెంచుతున్నాయి. ఈ సోమవారం తిన్నడికి విధేయుడు, స్నేహితుడు అయిన టిక్కీని పరిచయం చేశారు. టిక్కీ మరెవరో కాదు.. విష్ణు స్వారీ చేసే గుర్రం. టిక్కీతో ఉన్న విష్ణు పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విష్ణు లుక్ ఆకట్టుకుంటోంది. డాక్టర్ మోహన్‌బాబు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రానికి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు. డిసెంబర్‌లో ఈ భారీ చిత్రం విడుదల కానుంది.

నువ్వే నా సూర్యుడు.. చంద్రుడు

నటుడు సిద్ధార్థ్, నటి అదితీరావు హైదరీ సోమవారం వివాహబంధంలోకి అడుగుపెట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు అదితి. 'నువ్వే నా సూర్యుడు.. చంద్రుడు.. నువ్వే నా తారాలోకం. మిసెస్ అండ్ మిస్టర్ అదు సిద్దు' అనే క్యాప్షన్‌ను ఆమె జత చేశారు. వీరి పెళ్లి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని వీరి వివాహం జరిగిందని అంటున్నారు కానీ అక్కడి ఆలయంలో మాత్రం ఆ ఛాయలేవీ కనిపించలేదు. అక్కడ ఏ వివాహం కూడా జరగలేదని ఆలయ పూజారులు తెలియజేస్తున్నారు. మరెక్కడైనా ఆ వివాహం జరిగిందే మోననే భావన వ్యక్తమవుతోంది. అదితీరావు హైదరీ వనపర్తి సంస్థానాధీశుల్లో చివరి రాజుగా ఉన్న రామేశ్వర్‌రావు మనుమరాలు, ఆయన కూతురు విద్యారావు సంతానం అదితి. సిద్ధార్థ్, అదితి ఇద్దరికీ ఇది రెండో వివాహం. సిద్ధార్థ్ తన చిన్ననాటి స్నేహితురాలు మేఘనను 2003లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత 2007లో ఇద్దరి మధ్యలో వచ్చిన విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నారు. అదితి 2002లో సత్యదీప్ మిశ్రాను పెళ్లి చేసుకొని 2012లో విడిపోయారు.

- ఆంధ్రజ్యోతి, శ్రీరంగాపూర్



ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చేలా..



చంద్రహాస్ హీరోగా నటిస్తున్న 'రామ్‌నగర్ బన్నీ' చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సినిమాలో విస్మయశ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రీతూ మంత్ర హీరోయిన్లు. శ్రీనివాస్ మహత్ దర్శకుడు. అక్టోబర్ నాలుగున సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు మలయజ ప్రభాకర్, పొడకండ ప్రభాకర్ చెప్పారు. ఈ సినిమా కోసం చంద్రహాస్ బాగా కష్టపడ్డాడనీ, అతనికి మంచి పేరు తెచ్చే సినిమా అవుతుందని దర్శకుడు శ్రీనివాస్ మహత్ చెప్పారు. అన్ని ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులందరికీ నచ్చేలా చిత్రం ఉంటుందని తెలిపారు. ఫ్యామిలీ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని చిత్రకథ ఎన్నుకున్నామనీ, తన కుమారుడి మొదటి సినిమాను సకుటుంబంగా ప్రేక్షకులు చూడాలనుకున్నామనీ ప్రభాకర్ చెప్పారు మరో రెండు సినిమాలు ఉన్నా మొదట 'రామ్‌నగర్ బన్నీ'నే విడుదల చేస్తున్నామని తెలిపారు.

సండే గర్ల్ ఫ్రెండ్



కామ్నా శర్మ, సుమన్. అలీ ప్రధాన పాత్రలు పోషించే 'సండే గర్ల్ ఫ్రెండ్' షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. హీరోయిన్ కామ్నాపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నటి ఇంద్రజ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, అలీ తొలి క్లాప్ ఇచ్చారు. సుమన్ స్క్రిప్ట్ అందజేశారు. లవ్, మ్యూజికల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు గడ్డం వెంకటరమణారెడ్డి చెప్పారు. పాటల రికార్డింగ్ పూర్తయిందనీ, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలు పెడతామనీ ఆయన తెలిపారు.

సైకలాజికల్ థ్రిల్లర్



ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన 'కలి' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. జర్నలిస్టు రాఘవేంద్రరెడ్డి సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి శివ శేషు దర్శకుడు. కలి పాత్ర చుట్టూ అల్లుకున్న కథ ఇదనీ, ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగిస్తుందనీ దర్శకుడు చెప్పారు. లీలా గౌతమ్ వర్మ ఈ సినిమాకు నిర్మాత. నేహా కృష్ణన్, గౌతంరాజు, గుండు సుదర్శన్, మణిచందన, మధుమణి ఇతర ముఖ్య తారాగణం.

బాలీవుడ్‌లో హీరోలు.. దక్షిణాదిలో విలన్లు

తెలుగు సినిమాల్లో ప్రతినాయక పాత్రలకు పరభాషా విలన్లను ఎంచుకోవటం మేకర్స్‌కు ఎప్పట్నుంచో ఉన్న ఆనవాయితీ. అయితే ఆ పరభాషా విలన్ల స్థానంలో ఇప్పుడు ఒకే ఇండస్ట్రీకి చెందిన నటులు ఎక్కువగా కనిపిస్తున్నారు. బాలీవుడ్‌లో హీరోలుగా ఉన్న ఎంతో మంది నటులు ఇప్పుడు దక్షిణాది సినిమాల్లో విలన్లుగా ఎంట్రీ ఇస్తున్నారు. అలా దక్షిణాదిలో విలన్లుగా మారిన వారెవరో ఓ లుక్కేద్దాం.





సైఫ్ అలీఖాన్


బాలీవుడ్‌లో మంచి హిట్ ట్రాక్ ఉన్న కథానాయకుల్లో సైఫ్ అలీఖాన్ ఒకరు. లవర్ బాయ్ నుంచి యాక్షన్ రోల్స్ వరకు ఎన్నో పాత్రల్లో నటించి మెప్పించిన ఆయన.. ప్రస్తుతం ప్రతినాయకుడిగా మారారు. ఇప్పటికే ఓం రౌత్ దర్శకత్వంలో ప్రభాస్ నటించిన పౌరాణిక చిత్రం 'ఆదిపురుష్' చిత్రంలో రావణుడి పాత్రను పోషించారు సైఫ్. ఇప్పుడు కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర'లో 'భైర' పాత్రలో నటిస్తున్నారు. ఇటీవలే విడుదలైన 'భైర' గ్లింప్స్, ట్రైలర్‌తో సినిమాలో ఆయన పాత్ర ఎంత క్రూరంగా ఉంటుందో సినీ ప్రియులకు మేకర్స్ హింటిచ్చారు.


ఇమ్రాన్ హష్మీ

బాలీవుడ్‌లోనే మోస్ట్ రొమాంటిక్ హీరోల్లో ఇమ్రాన్ హష్మీ ఒకరు. సీరియల్ కిస్సర్‌గా పేరు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు ప్రతినాయకుడి పాత్రలకు సిద్ధమయ్యారు. సుజీత్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న 'దే కాల్ హిమ్ ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్)లో ఆయన ఓమి భాయ్ అనే పాత్రలో కనిపిస్తున్నారు. ఇమ్రాన్ బర్త్‌డే సందర్భంగా రిలీజైన పోస్టర్‌లో ఆయన పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది.

సంజయ్ దత్

దక్షిణాదికి బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ హీరోగానూ.. విలన్‌గానూ ఇప్పటికే సుపరిచితం. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యష్ హీరోగా నటించిన 'కేజీఎఫ్' సిరీస్‌లో 'అధీరా' పాత్రలో కరడుగట్టిన విలన్‌గా ఆయన కనిపించారు. గతేడాది లోకేశ్ కనగరాజ్, తమిళ నటుడు విజయ్ కలయికలో వచ్చిన 'లియో'లోను ఆయన పోషించిన పాత్ర ప్రతినాయక ఛాయలున్నదే. ఈ మధ్యే రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోనూ 'బిగ్ బుల్'గా ఆయన అదరగొట్టారు. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న హారర్ కామెడీ 'రాజా సాబ్'లోనూ ఆయన నటిస్తున్నారు. ఇందులో ప్రభాస్ జీవితాన్ని మలుపు తిప్పే ఘోస్ట్ పాత్రలో ఆయన కనిపించనున్నారని టాక్. అయితే ఇది పాజిటివా, నెగెటివా అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్. ఇక ఇప్పటికే వివేక్ ఒబెరాయ్ 'వినయ విధేయ రామ', 'వివేకం' 'లూసీఫర్'లో.. అర్జున్ రామ్‌పాల్ 'భగవంత్ కేసరి'లో.. అక్షయ్‌కుమార్ '2.0' చిత్రాలలో విలన్ పాత్రలు పోషించిన సంగతి తెలిసిందే.







బాబీ డియోల్

ప్రతినాయకుడి అవతారమెత్తిన మరో బాలీవుడ్ కథానాయకుడు బాబీ డియోల్. ఇప్పటికే 'యానిమల్' సినిమాలో రణ్‌బీర్‌తో తలపడ్డారు ఆయన. 'యానిమల్'లో కనిపించింది కాసేపు అయినా.. తన నటనతో ప్రేక్షకులకు విలన్ అంటే వీడేరా అనే ఫీల్‌ను కలిగించారు బాబీ. ఆయన ప్రస్తుతం దక్షిణాదిలో విలన్‌గా వరుస అవకాశాలను సొంతం చేసుకున్నారు. తమిళ నటుడు సూర్య నటిస్తున్న 'కంగువ'లో భీకరమైన పోరాట యోధుడిగా ఆయన కనిపించనున్నారు. అలాగే, కే.ఎస్.రవీంద్ర దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నటిస్తున్న 'ఎన్‌బీకే109' చిత్రంలోనూ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. పవన్‌కల్యాణ్ నటిస్తున్న హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'హరిహర వీరమల్లు'లోనూ బాబీడియోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఇందులో ఆయన మొఘల్ ఎంపెరర్ ఔరంగజేబ్ పాత్రను పోషించడం విశేషం. అలాగే విజయ్ నటిస్తున్న నూతన చిత్రంలోనూ ఆయన ప్రతినాయకుడి పాత్రను పోషించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. హెచ్.వినోద్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'విజయ్ 69'.

రేపు జూడో జట్ల ఎంపిక

బొబ్బిలి: రామభద్రపురం మండలంలోని కొట్టక్కి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలకు చెందిన అండర్- 14, 17 విభాగాల్లో జూడో బాలబాలికల జట్లు ఎంపిక చేయనున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కృష్ణం రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 విభాగానికి జనవరి ఒకటి 2011 తర్వా త, అండర్-17 విభాగానికి జనవరి ఒకటి 2008 తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి, కొట్టక్కి పీడీ బొత్స రత్నకిశోర్ ఫోన్ 9440127587 నంబరుకు సంప్రదించాలని తెలిపారు. అదే వేదికపై అండర్ -19 జిల్లా జూడో జట్టు ఎంపిక కూడా జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల వారు ఎంపిక పోటీల్లో పాల్గొనాలని కోరారు.

నేడు నులి పురుగుల మందులు పంపిణీ

లక్కవరపుకోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల మందుల పంపిణీ చేయనున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి బి.అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పాఠశాలల సిబ్బంది సహకరించాలని కోరారు.

పంచాయతీల్లో స్వచ్ఛత కార్యక్రమాలు

లక్కవ రపుకోట: పంచాయతీల్లో మంగళవారం నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపీడీవో కే.రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల లీడర్లు, ఉపాధి హామీ పథకం మేట్లు పాల్గొనాలని కోరారు.

కంటి శస్త్ర చికిత్సలకు 15 మంది

తెర్లాం: పెరుమాళి పీహెచ్‌సీ ఆవరణలో వైద్యాధికారి ఎస్.వెంకటేష్ పర్యవేక్షణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారి రోటరియన్ సప్పటి వసంతరావు, సామాజిక ఆరోగ్య అధికారి పుష్పలత, క్షేత్ర పర్యవేక్షకులు భవాని శ్రీనివాస్, స్టాఫ్ నర్సు భవాని, ఫార్మాసిస్టు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాలు పంపిణీ

బొబ్బిలి రూరల్: మండలంలోని చినమోసూరు వలసలో సోమవారం బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో గిరిజనులకు చీరలు, దుస్తులు, నిత్యవసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సైనికులు ఎం.ధర్మారావు, మరడ రామినాయుడు, అలుగోలు గోవింద నాయు డు, వీఎన్ శర్మ పాల్గొన్నారు.

ఉత్తమ రోటరీ క్లబ్‌గా బొబ్బిలి

బొబ్బిలి రూరల్: బొబ్బిలి రోటరీ క్లబ్ కార్యదర్శి అధ్యక్షుడిగా తొమ్మిదేళ్లుగా సేవలందిస్తున్న రొటేరియన్ పాల్ హరీస్ ఫెలో జేసీ రాజు ఉత్తమ అధ్యక్షుడిగా, ఉత్తమ రోటరీ క్లబ్‌గా బొబ్బిలి రోటరీ క్లబ్‌గా ఎంపికచేశారు. ఈ మేరకు సోంపేటలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ రోటరీ సంస్థ సమన్వయకర్త, రోటరీ మాంక్ రవి వడ్లమాని, డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకటేశ్వరావు, పూర్వ జిల్లా గవర్నర్ రామారావు చేతుల మీదుగా అవార్డును అందించారు.

విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన

బొబ్బిలి: బొబ్బిలి బీసీ కళాశాల వసతిగృహంలో సోమవారం ఎయిడ్స్ ఇతర సుఖవ్యాధులపై యూత్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైడీవో ప్రతినిధి ఆర్‌డబ్ల్యూకే ఉమ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి, సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీఈ ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు సంత రెన్యువల్ కమిటీ సమావేశం

జామి: మండలంలోని ఏడాది కాలంగా లోట్లపల్లి పశువుల సంత రెన్యూవల్‌కు జరుగుతున్న ప్రయత్నాలు ఎప్పటికప్పుడు బెడిసికొడుతున్నాయి. కొంతమంది ఈ లైసెన్స్ ఎలాగైన ఆమోదింపజేయాడానికి పెద్దఎత్తున తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నా ఇవి సఫలీకృతం కావడం లేదు. మరోసారి మంగళవారం సంతకమిటీ సమావేశం లోట్లపల్లి సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు మండల ఈవోపీఆర్‌డీ శ్రీదేవి తెలిపారు. ఏడాదికాలంగా ఈ సంతకు రెన్యూవల్ లేకపోయిన జరిగిపోతుందని ఇటువంటి సమయంలో దీనిని నివారించాల్సిన సంబంధిత శాఖ అధికారులు మరి ఎందుకు ఆపడం లేదో.. ఈ సమావేశానికి అధికారులు ఎందుకు హాజరుకావడం లేదో అంటూ పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ సంత నిర్వహకుల ద్వారా కొంతమందికి లక్షల్లో ప్రయోజనం ఉంటుందని, అందుకే దీని రెన్యూవల్ కోసం పదే పదే తాపత్రయపడుతున్నారని అంటున్నారు. ఈరోజు జరిగే సమావేశంలోనైనా సంత రెన్యూవల్ అవుతుంతో లేక వాయిదా పడుతుందో వేచిచూడాల్సి ఉంది.

రాళ్లు తేలి.. కోతకు గురై



సంతకవిటి: మండలంలోని గోవిందపురం, ముకుం దపురం, నారాయణ రాజుపురం, మోదుగుల పేట గ్రామస్థులు మందరాడ, సంతకవిటి చేరుకునే రహదారి పూర్తిగా దెబ్బ తింది. ఇటీవల కురిసిన వర్షాలకు మూడు కిలో మీటర్ల మేర రాళ్లుతేలడంతోపాటు పలుచోట్ల కోతకు గురైంది. దీంతో ఆటోలు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. సంతకవిటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వందలాది మంది విద్యార్థులు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. వైసీపీ హయాంలో ఈ రోడ్డుకు కనీస మరమ్మతులు చేయకపోవడంతో ప్రస్తుతం పూర్తిగా పాడైందని పలువురు వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఉన్నా.. కబ్జా

● ఆలయ భూమి ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు ● ఇదీ రంగారాయపురం రామలింగేశ్వరాలయం వద్ద పరిస్థితి

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురంలో గల శ్రీరామ లింగేశ్వరాలయానికి చెందిన స్థలంలో కొందరు అక్రమంగా షాపులు నిర్మించారు. వాటిలో దర్జాగా ప్రవేశించారు. ఇక్కడ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డులు సైతం పీకేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఓ సారి పరిశీలిస్తే.. రామలింగేశ్వరస్వామి పేరుతో రంగారాయపురంలో సర్వే నెంబరు 9/4లో సుమారు 1.19 ఎకరాల భూమి విశాఖ-అరకు హైవేను ఆనుకుని ఉంది. ఈ భూమిపై వచ్చిన ఫలసాయాన్ని ఆలయంలో దూపదీప నైవేద్యాలకు కేటాయించిన విషయం విదితమే. అయితే ఈ భూమిపై గత వైసీపీ ప్రభుత్వంలో కబ్జాదారుల కళ్లుపడడంతో ఆక్రమణకు వెంటనే స్కెచ్ గీశారు. చకచకా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయంపై గ్రామస్థులు దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులకు ఫిర్యాదుచేసినా ఫలితం లేకుండాపోయింది. సినీనటి కరాటే కళ్యాణి కూడా ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల్లో చలనం లేదు. ఇక్కడ దర్జాగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టి, విద్యుత్ కనెక్షన్ తీసుకొని షాపుల్లో ప్రవేశాలు కూడా చేసేశారు. ఇటీవల నిర్మాణాల ఎదుట ఏర్పాటుచేసిన హెచ్చరికబోర్డులు సైతం ఆక్రమణదారులు పీకిపారేశారు. ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల తీరుపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





ఆక్రమిత స్థలంలో నిర్మించిన షాపులు, ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

చర్యలు తీసుకుంటాం

ఆలయ భూముల కబ్జాపై తమకు ఫిర్యాదులు వచ్చాయని ఈవో ఎం.ప్రసాదరావు తెలిపారు. ఈవిషయంపై ఎస్ఐ, సీఐలకు ఫిర్యాదు చేశామని చెప్పారు. దేవదాయశాఖ ఏసీకి, కలెక్టర్ గ్రీవెన్స్‌లో కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మహిళ ఆత్మహత్య

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

(విజయనగరం రూరల్/క్రైం/సాలూరు): వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాలూరు పట్టణంలోని వ్యవసాయశాఖలో ఏఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న రెడ్డి హైమావతి(45)కి పదేళ్ల క్రితమే సాలూరు ప్రాంతానికి చెందిన నల్లా ప్రసాద్‌తో వివాహమైంది. కొద్ది రోజులు వీరిద్దరూ సఖ్యతగా ఉన్నా, ఆ తరువాత తగాదాల కారణంగా దూరంగా ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు.. నల్లా వైష్ణవి, నల్లా శ్రావణ్ ఇద్దరూ విశాఖలోని రెసిడెన్షియల్‌లో చదువుతున్నారు. పిల్లల చదువుకు దగ్గరగా ఉండాలనే ఉద్దేశంతో ఆమె విజయనగరం మండల పరిధిలోని కోరుకొండ రామానారాయణం రోడ్డుకు ఆనుకుని ఉన్న అపార్టుమెంటులో నివసిస్తోంది. రోజూ విధుల నిమిత్తం సాలూరు వెళ్లి తిరిగి విజయనగరం చేరుకుంటోంది. గత కొన్నేళ్లుగా సాలూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తితో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. వీరిద్దరూ తరచూ విజయనగరంలో ఉండేవారు. ఆ వ్యక్తికి అనుమానం ఎక్కువ. దీంతో తరచూ వీరిద్దరూ గొడవలు పడుతున్నట్టు స్థానికులు అందించిన సమాచారం. వరుసగా మూడు రోజులు సెలవు కావడంతో హైమావతి విజయనగరంలోనే ఉంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆమె ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. సోమవారం వేకువజామున గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్యకు ముందు రాసిన లేఖ ఉండడంతో ఆ దిశగా విచారణ ప్రారంభించారు. ఆదివారం హైమావతి మృతి చెందిన సమయానికి ప్రియుడు ఆమె వద్దే ఉండడంతో ముందస్తుగా అతనిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హైమావతి మృతదేహానికి పంచనామా నిర్వహించిన రూరల్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించి అనంతరం బంధువులకు అప్పగించారు. బంధువులు ఈ మృతదేహాన్ని సాలూరుకు తీసుకువెళ్లారు. హైమావతి ప్రేరేపిత ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దీంతో 306 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపారు. ● హైమావతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వార్త తెలుసుకుని కుటుంబసభ్యులు వెంటనే విజయనగరం చేరుకున్నారు. పిల్లలైన వైష్ణవి ఇంటర్ చదువుతుండగా, ప్రవీణ్‌కుమార్ ఎనిమిదో తరగతి విశాఖపట్నంలో చదువుతున్నారు. మృతదేహాన్ని సాలూరుకు తీసుకొచ్చి పట్టణంలో అంత్యక్రియలు నిర్వహించారు. తల్లి మృతి చెందటంతో పిల్లలు జీర్ణించుకోలేకపోతున్నారు. వారిని ఓదార్చటం ఎవరితరం కాలేదు.



హైమావతి (ఫైల్ ఫోటో)

విజయనగరం డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

విజయనగరం క్రైం: విజయనగరం డీఎస్పీగా ఎన్ శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి డీటీసీలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. ఈయన గతంలో విజయనగరం ట్రాఫిక్ డీఎస్పీగా, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీగా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. విజయనగరం సబ్ డివిజన్ శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయనగరం సబ్ డివిజన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణే ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక దృష్టి సారిస్తామని, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్‌లలో ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని అమలయ్యేలా చేస్తామన్నారు.



బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ శ్రీనివాసరావు

శస్త్రచికిత్సతో గ్లకోమా నివారణ

బొబ్బిలి: గ్లకోమా ముందుగా గుర్తించగలిగితే కచ్చితంగా శస్త్రచికిత్స ద్వారా నివారించవచ్చని ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టర్ కేవీ అప్పారావు తెలిపారు. బొబ్బిలి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్లకోమా సోకిన వారికి మరి కంటి చూపు ఉండదన్న భ్రమలను తొలగించుకోవాలని తెలిపారు. ఉత్త రాంధ్ర ప్రాంతంలో ఈ వ్యాధి వారసత్వ సంక్రమిస్తోందని, మేనరిక వివాహాలు కూడా ప్రధానకారణమని చెప్పారు. అధిక రక్తపోటు, మధుమేహం, గుండెజబ్బులతో బాధపడేవారికి ఎక్కు వగా గ్లకోమా ప్రభావంతో కంటి చూపు పోయే ప్రమాదముందని తెలిపారు. కాగా తిరుపతిలో ఏపీ రాష్ట్ర ఆప్తాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు.

'వందేభారత్'కు హాల్ట్ ఇవ్వాలి


● కేంద్రమంత్రిని కోరిన బొబ్బిలి ఎమ్మెల్యే



రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న బేబీనాయన

బొబ్బిలి: దుర్గ్ నుంచి విశాఖపట్నానికి ప్రారంభమైన వందేభారత్ రైలుకు బొబ్బిలిలో హాల్ట్ ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన కోరారు.ఈ మేరకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం బొబ్బిలిలో బేబీనాయన విలేకరులతో మాట్లాడుతూ రామ్మో హన్ నాయుడు సానుకూలంగా స్పందించారని, వెంటనే డీఆర్ఎంతో మాట్లాడారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ఆసుపత్రుల అవసరాల కోసం రోగులు ప్రతి రోజూ వేల సంఖ్యలో విశాఖ రాకపోకలు సాగిస్తుంటారని మంత్రికి వివరించామని పేర్కొన్నారు.ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లామని చెప్పారు. కార్య క్రమంలో గున్నతోటవలస సర్పంచ్ సింగిరెడ్డి ఈశ్వరరావు, నంది హరిప్రకాశ్ పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించండి



కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలు

రాజాం రూరల్: మునిసిపాలిటీ పరిధిలోని నర్సింహనాయుడు కాలనీలో వ్యర్థాలు తొలగించకపోవడంతో ప్రజలకు కంటి మీద కునుకులే కుండాపోతోంది. రాజాంలోని ప్రధాన కాలువ నుంచి ప్రవహించే మురుగునీటితో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు కాలనీ సమీపంలో పేరుకుపోతుండడంతో స్థానికులు అవస్థలకు గురవుతున్నారు. దుర్గంధం వెద జల్లుతుండడంతోపాటు దోమలు స్వైర విహారం చేస్తుండడంతో వ్యాధుల బారినపడతామేమోనని భయాందోళన చెందుతున్నారు. కాలువలో చెత్త తొలగించాలని మునిసిపల్ యంత్రాంగాన్ని కోరినా ప ట్టించుకోలేదని కాలనీవాసులు వాపోతున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



ఎమ్మెల్యే దంపతులను అభినందిస్తున్న గిరిజన జేఏసీ నాయకులు

లక్కవరపుకోట: గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. సోమవారం ఎల్.కోటలో టీచర్ జ్యోతి ఆధ్వర్యంలో గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, ఉపాధి, యువత జేఏసీ నాయకులు ఎమ్మెల్యే దంపతులను అభినందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కోట మండల టీడీపీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, శేఖర్, గిరిజన జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రకళకు రాష్ట్రస్థాయి అవార్డు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 16: విజయనగరం జిల్లాకు చెందిన మల్లా చంద్రకళకు ఏపీఎంపీఏ రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. ఏపీ ఎంఈడీ అసోసియేషన్-2024 విద్యా సంవత్సరానికి గానూ బెస్ట్ టీచర్ ఎడ్యుకేటర్ అవార్డు ఏపీ ప్రభుత్వ పరీక్షల డైరెక్టరు డి దయానందరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఆంధ్రయూనివర్సిటీ పరిధిలో హెచ్‌కియా కళాశాల ఆఫ్ ఎడ్యుకేషన్ ఆంగ్ల వి భాగంలో పనిచేస్తున్న చంద్రకళకు అవార్డు రావడం పట్ల పలువురు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.




అవార్డు అందుకుంటున్న చంద్రకళ

నేటి నుంచి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రూపొందించి అమలు చేస్తున్న స్వచ్ఛతే సేవా కార్యక్రమాలను మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్టు కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీరు సరిత ఒక ప్రకటనలో తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ అవశ్యకతను తెలియజేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు నెల 2 వరకూ 15 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 17న ఉదయం 7.30 గంటలకు అయ్యన్నకోనేరు వద్ద స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టరు అంబేద్కర్, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారన్నారు. అయ్యన్నకోనేరు వద్ద మానవహారంగా ఏర్పడి చెరువు పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నారన్నారు. అప్పటి నుంచి ప్రతి రోజూ అనేక కార్యక్రమాల అనంతరం అక్టోబరు 1న ఆర్టీసీ కాంప్లెక్స్ కోడిరామమూర్తి వ్యాయామశాల, కలెక్టరేట్ ప్రాంతాల్లో ఉన్న సామాజిక మరుగుదొడ్ల శుభ్రత కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కలప అక్రమ రవాణా

శృంగవరపుకోట రూరల్: మండలంలో కలప రవాణా గుట్టుగా సాగిపోతుంది. అధికారుల కళ్లుగప్పి ట్రాక్టర్లు, బొలెరో వాహనాలతో రాత్రులు, వేకువజాము సమయంలో ఈ కలప రవాణా సాగిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఉసిరి జంక్షన్ నుంచి వెంకటరమణపేట వైపు ట్రాక్టర్‌పై కలప తరలించారు. ఈ అక్రమరవాణపై పలువురు మాట్లాడుతూ మండలంలో సామిల్లుల్లో ఈ కలప అమ్ముకుంటారని తెలిపారు. ఇలా కృష్ణాపురం, తాటిపూడి, ముషిడిపల్లి, బొడ్డవర ప్రాంతాల నుంచి కలప పెద్దఎత్తున తరలిపోయి అక్రమార్కులు లక్షలు సంపాదిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ కలపరవాణ వెనుక కొంతమంది షామిల్లు యాజమానులు ఉన్నారని వాదన. ఎస్.కోట, జామి మండలాల్లోకి ఈ కలప తరలిపోతుందని, సంబంధిత అధికారులు ఈ మిల్లుల్లోని కలపకు.. వారి వద్ద రికార్డులు పరిశీలిస్తే అక్రమాలు బయటకు వస్తాయని అంటున్నారు.



ఉసిరి జంక్షన్ నుంచి వెంకటరమణపేట వైపు ట్రాక్టర్‌తో తరలుతున్న కలప

వరద బాధితులకు విరాళాలు

బొబ్బిలి రూరల్: విజయవాడ వరద బాధితులకు బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యే బేబీనాయనకు విరాళాలు అందజేశారు. తెర్లాం మండలంలోని పెరుమాళికి చెందిన సాగిరాజు హేమలత, టీడీపీ నాయకులు రూ.95,555, బొబ్బిలిలోని ఫ్యామిలీ కిచెన్ ఓనర్ గోనా మానస, బూర్లి ధనలక్ష్మి, చీమల గౌరి, చెల్లూరి లక్ష్మి, అరిసెల ఈశ్వరమ్మ, బొండపల్లి ధనలక్ష్మి, నక్కజ్యోతి, గోనా సునీత దేవి, బిగులు లక్ష్మి, బండుపల్లి దివ్య రూ. 66,666, బొబ్బిలికి చెందిన రెడ్డి ప్రసాదు రూ.30,000 అందజేశారు. తెర్లాం మండలంలోని అరసబలగ సర్పంచ్ కొరగంజి సాయిరాం, టీడీపీ నాయ కులు, గోపాలవలస పంచాయతీ టీడీపీ నాయకులు, రామభద్రపురానికి చెందిన వసంతుల తిరుపతి రావు, వెంకటరావు, మత్స లక్ష్మణరావు రూ.20,000 చొప్పున విరాళాలు ఇచ్చారు. బొబ్బిలికి చెందిన రంభ వేణుగోపాలరావు, సాగర్,జగదీష్, గుడ్ల ప్రసన్న, గుడ్ల రమేష్, మోదుగువలసకు చెందిన గుల్లిపల్లి జగన్, జన్నివలస వాస్తవ్యులు పిన్నింటి శంకరరావు, దుర్గమ్మ, బి.శివకృష్ణ, వి.ఓంకార్, పి.తిరుపతి రూ.10,000 చొప్పున ఇచ్చారు. పాతరేగకు చెందిన శ్రీకృష్ణ యాదవ్ గ్రూపు నిర్వాహకులు రూ.6,500 అందజేశారు. బొబ్బిలికి చెందిన వారణాసి శ్రీనివాస రావు, నల్లా వెంకటనాయుడు రూ.5,000 చొప్పున, తారాపురం గ్రామ యువత రూ.3,000 బేబీనాయనకు అందజేశారు.

తాపీ మేస్త్రి ఆత్మహత్య

బొబ్బిలి: బొబ్బిలి రెడ్డికవీధికి చెందిన తాపీ మేస్త్రి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ కటకం సతీష్ కుమార్, స్థానికుల కథనం మేరకు.. చీపురుపల్లి మండలంలోని పల్లి గంగ్రేడు గ్రామానికి చెందిన జామి అప్పారావు (40) సుమారు ఐదేళ్ల నుంచి బొబ్బిలి రెడ్డికవీధిలో భార్యాపిల్లలతో కలిసి అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. వ్యసనాలకు బానిసగా మారిన అప్పారావు ఇంట్లో గ్యాస్‌స్టౌ, సిలెండరు అమ్మేసి మద్యం సేవించాడు. ఈ నేపథ్యంలో అప్పారావు తీరుకు విసుగు చెందిన భార్య ఆదిలక్ష్మి ఇద్దరి పిల్లలను తీసుకొని కన్నవారింటికి వెళ్లిపోయింది. దీంతో కలత చెందిన అప్పారావు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శ్రీహరి సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి సజీవ దహనం

శృంగవరపుకోట రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామంలో వృద్ధుడు సజీవ దహనం అయిన ఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి గ్రామస్థులు, పోలీసులు సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పెంట తాత(76) ఆదివారం రాత్రి గ్రామంలో జరిగే రెండు వినాయక అనుపు కార్యక్రమాలకు వెళ్లాడు. అక్కడ బాగా మద్యం సేవించి ఇంటికి చేరుకున్నాడు. భార్య సూరిడమ్మ అన్నం తినాలని కోరినా తినకుండా నిద్రకు ఉపక్రమించాడు. తమకు ఉన్న రెండిళ్లలో ఒక ఇంటికి వెళ్లి తలుపుగడి వేసుకుని పడుకున్నాడు. పడుకునే ముందు బీడీ కాల్చే అలవాటు ఉన్న వృద్ధుడు బీడీ వెలిగించి మద్యం మత్తులో మంచంపై అలాగే పడుకుండిపోయాడు. బీడీకి ఉన్న అగ్గి మంచానికి అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ మంటల్లో మత్తులో వున్న వృద్ధుడు సజీవదహనం అయ్యాడు. భార్య ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ప్రసాద్‌రావు కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. అందరికీ వివాహాలయ్యాయి.



పెంట తాత (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పూసపాటిరేగ: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా పరవాడ మండలం, గొర్లవాపాలెం గ్రామానికి చెందిన మిరియాల సరస్వతి(51), బంధువు నీలాపు అనసూయ ఒక పని నిమిత్తం సోమవారం శ్రీకాకుళం జిల్లా రణస్థలం గ్రామానికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి ఆటోలో వస్తుండగా మండలంలోని చోడమ్మ అగ్రహారం టీటైం వద్ద ఆటో దిగారు. అయితే మృతురాలు కాలకృత్యం తీర్చుకునేందుకు రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న బొలెరో వ్యాన్ వేగంగా వచ్చి ఆమెను బలంగా ఢీకొంది. దీంతో తలపై బలమైన గాయం తగిలి రక్తస్రావం జరగటంతో అక్కడికక్కడే మృతి చెంది. పోలీసులు ఆమె కుటుంబీకులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి..

పార్వతీపురం రూరల్: మండలంలోని వైకేఎం కాలనీకి చెందిన కునుకు రామ్‌ప్రసాద్(35) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఆదివారం రాత్రి మండలంలోని నర్సిపురం గ్రామ సమీపంలో ఉన్న చెరువుకు కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశత్తు చెరువులో పడి మృతిచెందాడు. సోమవారం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి, కుటుంబానికి సమాచారం ఇచ్చారు. భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ దినకర్ తెలిపారు.

అదనపు కట్నంకోసం వేధిస్తున్న వ్యక్తిపై కేసు

భోగాపురం: మండలం గుడివాడ గ్రామానికి చెందిన దాసరి రజితరెడ్డి తన భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని సోమవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ ఎస్.వి.ప్రభాకర్ తెలిపారు. గుడివాడ గ్రామానికి చెందిన దాసరి రజితరెడ్డికి అదే గ్రామానికి చెందిన సాడి అభిషేక్‌తో 2023లో వివాహమైంది. అప్పట్లో అభిషేక్ అనుకున్న దాని ప్రకారం కట్నం తీసుకుని వివాహం చేసుకున్నాడు. మరలా అదనంగా కట్నం తీసుకురావాలంటూ గత కొంత కాలంగా భర్త అభిషేక్‌తో పాటు భర్త కు టుంబ సభ్యులు సాడి లక్ష్మీనారాయణమ్మ, నరసమ్మ వేధిస్తున్నారన్నారు. దీనిపై బాధితురాలు రజిత రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భోగాపురం: భోగాపురం పంచాయతీ వనుంపేట సమీప జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి సీఐ ఎస్.వి.ప్రభాకర్ సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనుంపేటకు చెందిన బాడితమాని రాముడు ఈనెల 14వ తేదీ రాత్రి రోడ్డు దాటుతుండగా విశాఖ వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే స్కూటీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు విజయనగరం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై బాధితుడి కుటుంబ సభ్యుడు వనుం కనకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ ఎస్.వి.ప్రభాకర్ తెలిపారు.

మద్యం సీసాలు ధ్వంసం

డెంకాడ: డెంకాడ పరిసర ప్రాంతాల్లో గతంలో 11 కేసుల్లో పట్టుబడ్డ సుమారు 251 మద్యం సీసాలను పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ విజయగజపతి రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టామని డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. డెంకాడ పరిసర ప్రాంతాల్లో 11 కేసుల్లో పట్టుబడ్డ 108 ఎంఎల్ 165, 89 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేశామని, వాటిని సోమవారం ధ్వంసం చేశామన్నారు.

చిట్టిపుడివలసలో చైన్ స్నాచింగ్

వీరఘట్టం: మండలంలోని చిట్టిపుడివలస గ్రామం సమీపంలో యామక గౌరమ్మ మహిళ మెడలోని రెండు తులాల పుస్తెలతాడు బైకుపై వచ్చి దొంగ తెంపుకొని వెళ్లిపోయాడు. దీంతో మండలంలో ఒక్కసారి అలజడి మొదలైంది. ఎక్కడో పట్టణాల్లో జరుగుతున్న సందర్భాన్ని విని ఆందోళన చెందే ప్రజలు ఇప్పుడు మండలంలో జరగడంతో భయాందోళనలకు గురవుతున్నారు. నడిమికెల్ల గ్రామానికి చెందిన యామక గౌరమ్మ ప్రకృతి వ్యవసాయం విభాగంలో వలంటీర్‌గా పనిచేస్తుంది. విధుల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటల సమయంలో చిట్టిపుడివలస నడుచుకుంటూ వెళుతుంది. అదే సమయంలో బండిపైన వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని రెండు తులాల పుస్తెలాడును తెంపుకొని పారిపోయాడు. ఆమె కాస్త తేరుకొనే లోపే బండిపై వెళ్లిపోయాడు. దీనితో ఆమె సమీపంలో ఉన్న వారి సాయంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కళాధర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వినాయక నిమజ్జనోత్సవంలో కొట్లాట

● మరిపిల్లిలో ఇరువర్గాలపై కేసు నమోదు

సాలూరు రూరల్: మండలంలోని మరిపిల్లిలో వినాయక నిమజ్జనోత్సవంలో ఇరువర్గాల మధ్య కొట్లాట జరగడంతో సాలూరు రూరల్ పోలీసులు సోమవారం రాత్రి నలుగురిపై కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం మేరకు.. మరిపిల్లి యాదవవీధికి చెందిన గణనాథుని విగ్రహాన్ని ఆదివారం రాత్రి నిమజ్జనానికి ఊరేగిస్తున్నారు. ఆ సమయంలో తమ వీధివైపు విగ్రహాన్ని తీసుకురావద్దని జన్ని చిన్నారావు, ఎంపీటీసీ సీతారాం అడ్డగించారని బోను కృష్ణవేణి ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా తనను వారు తిట్టి, కొట్టారని సముదాయించడానికి వచ్చిన తన సోదరుడు కసినబోయిన వెంకటరమణను కర్రతో కొట్టి చంపుతామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా రామమందిరం వినాయకుని వద్ద తాను నిద్రిస్తుండగా ఆ సమయంలో యాదవవీధికి చెందిన గణనాథుని ఊరేగింపు వచ్చిందని, వారు తారాజువ్వలను వెలిగిస్తుండగా తాను అభ్యంతరం తెలియజేశానని మరోవర్గానికి చెందిన బోయిన వెంకటేష్ ఫిర్యాదు చేశాడు. కసినబోయిన వెంకటరమణ వచ్చి కులం పేరుతో తిట్టి కొట్టారనిలో పేర్కొన్నాడు. అదే సమయంలో అక్కడకు వచ్చిన అక్క ఎంపీటీసీ జన్ని సీతారాం ఈ విషయమై అడిగిందని, దీంతో ఆమెను బోను కృష్ణవేణి కొట్టి, కులం పేరుతో తిట్టినట్లు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సాలూరు రూరల్ ఎస్ఐ పి.నర్సింహమూర్తి చెప్పారు. కాగా ఈ తగాదాకు డీజేసౌండ్ కారణమని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

పూరిపాక దగ్ధం

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేట గ్రామంలో ఆదివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో కమ్మల పాక కాలిబూడిదైంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి గ్రామంలో వినాయ విగ్రహ నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా పేలుడు పదార్థాలు పడ్డంతో గ్రామానికి చెందిన ముడారుపు ఈశ్వరరావు తండ్రి సూర్యనారాయణకు చెందిన కమ్మలశాల పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో శాల్లో ఉన్న నాలుగు నాటుకోడి పుంజులు, ఫర్నీచర్, వంట సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ. 2లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా. తహసీల్దార్ సన్యాసి నాయుడు ఆదేశాల మేరకు వీఆర్వో శ్రీనువాసరావు ప్రమాద వివరాలను సేకరించారు.



కాలిపోతున్న కమ్మలపాక

తాగునీటి అవస్థలు తీరేదెన్నడో?

- బోర్ల నుంచి ఉప్పు నీరు
- మూలకు చేరిన రక్షిత పథకం
- దృష్టి సారించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ఉల్లిభద్ర గ్రామవాసులు

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర గ్రామవాసులు తాగునీటికి అవస్థలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామంలో తాగునీటి అవసరాల నిమిత్తం రక్షితనీటి పథకం, 16 కొళాయిలను ఏర్పాటు చేశారు. అయితే ఈ కొళాయిల నుంచి ఎక్కువగా ఉప్పు నీరు వస్తోంది. దీంతో అవి మరమ్మతులకు గురి కావడంతో పాటు రక్షిత పథకం మూలకి చేరింది. సురక్షిత తాగునీటి కోసం గ్రామస్థులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈనేపథ్యంలో గ్రామంలో తాగునీటి అవసరాల కోసం ఇటీవల చిన్నపాటి రక్షిత పథకం ఏర్పాటు చేశారు. ఈ పథకం నుంచి ఏ సమయంలో తాగునీరు వస్తుందో, రాదో తెలియని పరిస్థితి ఏర్పడింది. తాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని పార్వతీపురం నుంచి వాహనాలపై కూడా తాగునీటిని సరఫరా చేసేవారు. ఈ సరఫరాను కొద్ది నెలలే చేసి చేతులు దులుపుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాం లో పథకం మంజూరు కోసం చర్యలు చేపట్టినా నేటికీ పూర్తికాని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పార్వతీపురం మండలం నర్సిపురం నుంచి కొంతమేర సరఫరాకు చర్యలు చేపట్టినా ఫలితం మాత్రం శూన్యం. జల జీవన్ మిషన్ పథకంలో ఇంటింటా కొళాయిలు ఏర్పాటు చేసినా తాగునీరు సరఫరా కావడం లేదు. గత పది రోజులుగా గ్రామస్థులు తాగునీటికి పలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్లుగా తాగునీటి సమస్య వేధిస్తున్నా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడంపై గ్రామస్థులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఉల్లిభద్రలో దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్న కొళాయిలు

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్

- మంత్రి సంధ్యారాణి



మంత్రికి సమస్యలు వివరిస్తున్న గిరిజనులు

సాలూరు: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సాలూరులోని తన స్వగృహంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. మక్కువ మండలం వెంకటభైరిపురం గ్రామానికి చెందిన చొంగలి శంకరరావు తన కొడుకు రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నాడని, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం చేయాలని కోరారు. పాచిపెంట మండలం పెద్దగెడ్డ ప్రాజెక్టు నిర్వాసిత గ్రామం కొటికిపెంటలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజలు కోరారు. పాచిపెంట మండలం గొట్టూరు పంచాయతీ కొత్తపొలంవలస గ్రామస్థులు కొటికిపెంట గ్రామ రెవెన్యూపరిధిలోగల సర్వేనెం.210లో సాగుభూమి ఉందని గతంలో రెండు సార్లు భూ సర్వే జరిగిన సమయంలో తాము అందుబాటులో లేకపోవటం వల్ల సర్వే నిలిచిందని, సర్వే చేయాలని కోరారు. సాలూరు మండలం కొదమ పంచాయతీకి రోడ్లు మంజూరు చేయాలని పలువురు యువకులు వచ్చి మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పిన్నింటి ప్రసాద్‌బాబు తోపాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవాలను రాజకీయం చేయడం సరికాదు

సాలూరు: వినాయక ఉత్సవాలను కూడా రాజకీయం చేయటం సరికాదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు.. మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరను ఉద్దేశించి విమర్శించారు. పట్టణంలో టీడీపీ శ్రేణులతో కలిసి ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలో ఉన్న గణపతి విగ్రహాలన్నీ సంప్రదాయబద్ధంగా ఎలాంటి డీజేలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలని మంత్రి సంధ్యారాణి ఆలోచన చేస్తూ ఉంటే.. గతంలో ఇలాంటి నిబంధనలు లేవని, హిందూ మతానికి ఆంక్షలు ఏంటని రాజన్నదొర ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. 15 ఏళ్లపాటు అధికారంలో ఉన్నా గ్రామ దేవత పండుగను చేయలేకపోయరని విమర్శించారు. ఇప్పుడు అందరి సహకారంతో చేసేందుకు మంత్రి ముందుకు వస్తే లేనిపోని మాట్లాడటం సరికాదన్నారు. 'మా పార్టీ తలుపులు తెరిస్తే మీ వద్ద ఒక్కరూ ఉండరని.. కేవలం మీరే మిగులుతారని' ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పప్పల మోహన్‌రావు, ఆముదాల పరమేష్, మత్స శ్యాం, యాసర్ల అప్పారావు, కారేపు చంద్ర తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో బెంబేలు



సీతంపేట మీదుగా రాయగడ వైపు వెళ్తున్న భారీ వాహనాలు

సీతంపేట రూరల్: సీతంపేట మన్యంలోని పాలకొండ-హడ్డుబంగి ప్రధాన రహదారిపై భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో వాహన చోదకులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మైదాన ప్రాంతం నుంచి సీతంపేట మీదుగా ఈ భారీ వాహనాలు ఒడిశా రాష్ట్ర వైపు తరచూ వెళ్తుండడంతో వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. ఆదివారం ఐటీడీఏకు సమీపంలో ఈ అతి భారీ వాహనాలను రహదారికి పక్కన నిలుపుదల చేశారు. ఒడిశా ప్రాంతానికి ప్రయాణిస్తున్న వాహనాల్లో ఓ వాహనం మరమ్మతులకు గురి కావడంతో వీటిని ఇక్కడ నిలుపుదల చేసినట్టు భారీ వాహనాల డ్రైవర్లు తెలిపారు. మరో పక్క టన్నుల కొద్దీ బరువుతో వెళ్తున్న ఈ వాహనాలతో రహదారులు కూడా ఛిద్రమవుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ఈ అతి భారీ వాహనాల రాకపోకలను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వంతెనను పూర్తి చేయండి

సాలూరు రూరల్: సొంపిగాం వద్ద సువర్ణముఖీ నదిపై అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ వంతెన నిర్మాణం 2022లో ప్రారంభించినా ఇప్పటివరకు పూర్తి చేయ కపోవడం దారుణమన్నారు. వరద వచ్చినప్పుడు ప్రమాదకర పరిస్థితిలో నది దాటాల్సి వస్తోందన్నారు. ఆయనతో పాటు సీపీఎం నాయకుడు సుకరయ్య తదితరులు ఉన్నారు.

సుభద్ర యోజనపై అవగాహన సదస్సు

సాలూరు రూరల్: సాలూరు మండలం కొఠియాలో ఒడిశా అధికారులు సోమవారం సుభద్ర యోజన అవగాహన సదస్సు నిర్వహించారు. ఒడిశా ప్రభుత్వం ఆ రాష్ట్ర మహిళలకు ఏడాదికి రూ.10వేలు అందించనున్నది. ఈ పథకాన్ని మంగళవారం భువనేశ్వర్‌లో ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన రథయాత్ర కొఠియా చేరుకుంది. ఈసందర్భంగా జడ్పీ మెంబరు టికాయ్ గెమ్మెల్, సమితి అధ్యక్షురాలు కల్పనా పంగి, పొట్టంగి బీడీవో సుకాంత్ కుమార్ పట్నాయక్, కొఠియా సర్పంచ్ (ఒడిశా వైపు నుంచి) లీవ్ గెమ్మెల్ తదితరులు పథకంపై వివరించారు.

రైల్వే ట్రాక్‌పై జారిపడిన కొండచరియలు

- రైళ్ల రాకపోకలకు అంతరాయం



రాళ్లను తొలగిస్తున్న రైల్వే సిబ్బంది

రాయగడ: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాయగడ-కొరాపుట్ రైలు మార్గంలో శికరపాయి- కెవుటిగుడ స్టేషన్ల మధ్య కొండచరియలు విరిగి పడడంతో ఆ మార్గంలో నడిచే రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం సాయంత్రం ఈ ప్రమాదం జరగడంతో యుద్ధ ప్రతిపాదికన బండరాళ్ల తొలగింపు చర్యలను రైల్వే శాఖాధికారులు చేపట్టారు. హౌరా నుంచి జగదల్‌పూర్ వెళ్లే శ్యామలేశ్వరి ఎక్స్‌ప్రెస్ రైలును కెవుటిగుడలో నిలిపివేశారు. కొరాపుట్ నుంచి భువనేశ్వర్ వెళ్లే హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయని రైల్వే వర్గాలు తెలిపాయి.

ఘనంగా మహమ్మద్ ప్రవక్త జయంతి



ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

రాయగడ: మహమ్మద్ ప్రవక్త జయంతిని రాయగడలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన బజారులో ఉన్న మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేసి, ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ప్రత్యేక వాహనంపై మహమ్మద్ ప్రవక్త చిత్రపటం ఉంచి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు.

ఒడిశా

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ పూజలు



రాయగడ: దేవశిల్పి విశ్వకర్మ పూజలను జిల్లాలోని పలు కర్మాగారాలు, మెకానిక్ గ్యారేజీలు, విద్యుత్ కార్యాలయాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ విగ్రహాలను కర్మాగారాల్లో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సారా బట్టీలపై దాడులు

రాయగడ: రాయగడ జిల్లా కాశీపూర్ సమితి టికిరి పోలీసులు సోమవారం సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో టికిరి పోలీసులు ఉపరదేస్క గ్రామ పరిధిలోని జరిపిన దాడుల్లో సారా తయారీ కోసం ఉంచిన ఇప్పపువ్వు, సారా ఊటలను ధ్వంసం చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించారు.

ప్రజారోగ్యంపై పర్యవేక్షించండి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహనరావు



గిరిజనులతో మాట్లాడుతున్న జగన్మోహనరావు

పాచిపెంట: మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన నీలంవలస, రాయిగుడ్డివలస గ్రామాలతో పాటు గురువునాయుడుపేట పీహెచ్‌సీని ఆయన సోమవారం సందర్శించారు. గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణ, సీజనల్ వ్యాధులపై సర్వే, పారిశుధ్య పనులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హైరిస్క్ సమస్యతో ఉన్న గర్భిణులను ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారని ఆరా తీశారు. వెల్‌నెస్ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయా, ఎంత దూరంలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ప్రతిరోజు ఎంతమంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ఈయనతో పాటు డీపీఎంవో డా.రఘుకుమార్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని విజయవంతం చేయండి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్

కురుపాం: కురుపాం కోట ప్రాంగణంలో మంగళవారం నిర్వహించనున్న వైద్య, రక్తదాన శిబిరాలను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళవా రం నిర్వహించనున్న వైద్య శిబిరంలో మిమ్స్ ఆసుపత్రి వైద్య నిపుణులు వైద్య పరీక్ష లు చేస్తారని చెప్పారు. అలాగే మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ

మెయిన్ రోడ్డులో గాంధీనగర్ సమీపంలో ఏర్పాటుచేసిన దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహం, అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవం ఉంటుందని వీరేశ్ చెప్పారు. ఈ కార్యక్రమానికి మంత్రి సంధ్యారాణి, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ కుమార్‌దేవ్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతి రాజు, బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు, పార్వతీపురం ఎమ్మెల్యే విజయ చంద్ర, పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ హాజరు కానున్నారని తెలిపారు.

నేటి నుంచి 'స్వచ్ఛతా హి సేవా'

గరుగుబిల్లి: మండలంలోని అన్ని పంచాయతీల్లో మంగళవారం నుంచి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపా రు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహిసామని తెలిపారు. అక్టోబరు 2న స్వచ్ఛ భారత్ దివాస్‌గా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

వరద బాధితులకు విరాళం



ఎమ్మెల్యే జగదీశ్వరికి విరాళాన్ని అందిస్తున్న టీడీపీ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం టీడీపీ కొమరాడ మండల అధ్యక్షుడు ఉదయశేఖర్‌పాత్రుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విరాళాల రూపంలో రూ.3లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని సోమవారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొట్నూరు వెంకట్‌నాయుడు, సర్పంచ్ గాజులు శ్రీనివాసరావు, పరశురాంపురం సర్పంచ్ అధికారి సుజాత, ఒప్పంగి రాఘవేంద్రరావు, పడాల హరిప్రసాద్, హిమరిక బలరాం, ధర్మారావు, అధికారి వేణు, మీసాల నాగేశ్వరరావు, బత్తిలి శ్రీనివాసరావు, దనకొండ రామారావు, నూకరాజు, జనసేన పార్టీ నాయకులు గౌరీశంకరరావు, కిల్లాన అనంతరావు, వాన ఉపేంద్ర, బీజేపీ నాయకులు శిష్టు శివన్నారాయణతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: విజయవాడ వరద బాధితుల సహాయార్థం టీడీపీ మండల త్రీమెన్ కమిటీ సభ్యులు రూ.2.52 లక్షలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి సోమవారం గరుగుబిల్లి మండలం సంతోషపురం పంచాయతీలో పెట్రోల్ బంకు వద్ద అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రమణారావు

సీతంపేట రూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయ ఆవరణలో మధ్యాహ్న భోజన, కార్మిక సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ బడ్జెట్ పెంచాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కనీస వేతనాలు అమలుచేయాలని, ప్రమాద బీమా వర్తింపు చేయాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని డిమాండ్ చేశారు. వంట కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ మధ్యాహ్న భోజన కార్మికులు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రొయ్యబారీ, బిడ్డిక ఉష, వంట కార్మికులు పాల్గొన్నారు.

బైబై గణేశ

- ఘనంగా గణనాథుని నిమజ్జనాలు
- ఊరేగింపులో ఆకట్టుకున్న బండ్ల వేషాలు

గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా జిల్లాలోని పలుచోట్ల సోమవారం ఘనంగా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో భాగంగా వినాయకుని విగ్రహాలను బండ్ల వేషాలు, కోలాట నృత్యాలు, డీజే సౌండ్స్ నడుమ ఘనంగా ఊరేగించారు. ఈ ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలుచోట్ల ఇంకా గణనాథుని విగ్రహాలు పూజలందుకుంటున్నాయి.

కొనసాగుతున్న పూజలు

గణపతి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో ఏర్పాటుచేసిన పలు వినాయక మండపాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వీరఘట్టంలో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడు



పాలకొండ: ఊరేగింపులో ఆకట్టుకున్న వేంకటేశ్వరస్వామి వేషధారణ



ఊరేగింపులో బాలరాముడు, అమ్మవారి వేషాలు



పార్వతీపురం టౌన్: శ్రీరామ గణపతికి పూజలు



గరుగుబిల్లి: గణపతిని నిమజ్జనానికి తీసుకువెళ్తున్న దృశ్యం



సాలూరు రూరల్: వాసవి మాత ఆలయంలో పంచముఖ నవ వినాయక విగ్రహాలకు పూజలు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని కొత్తవలస పెద్దవీధిలో శ్రీకొత్తపోలమ్మ యూత్ సభ్యులు ప్రతిష్ఠించిన శ్రీరామ గణపతికి సోమవారం కుంకుమార్చనలు నిర్వహించారు. ● పట్టణంలోని శ్రీధాన్య శివగణపతి ఉత్సవాల్లో భాగంగా గణేష్ యూత్ ఆధ్వర్యంలో స్వామి వారికి కల్యాణం నిర్వహించారు.



లడ్డూతో ఇంద్రపురోహిత్

వినాయకుడి లడ్డూ రూ.34 వేలు

పాలకొండ: ఏలాం జంక్షన్‌లో మంగళవారం భారీ వినాయకుడి అనుపోత్సవంతో లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలంలో మజీషా ఎంటర్ ప్రైజెస్ యజమాని ఇంద్రపురోహిత్ రూ.34వేలకు లడ్డూ దక్కించుకున్నారు.


ఎయిడ్స్‌పై అవగాహన



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: రేగిడి గ్రామంలో సోమవారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీటీసీ వర్కర్ అడ్డాకుల గీతారాణి ఆధ్వర్యంలో గిరిజన యువతకు ఎయిడ్స్ వ్యాధి సోకడానికిగల కారణాలను వివరించారు. ఈ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగిడి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రమణ, రాజేశ్వరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఏచూరికి నివాళి



ఏచూరికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

పాలకొండ: సీపీఎం నేత సీతారాం ఏచూరికి సోమవారం సిరికొండ గ్రామంలో నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. సీపీఎం మండల కార్యదర్శి దావాల రమణారావు, గిరిజన సంఘం పాలకొండ మండల అధ్యక్షుడు ఎస్.గంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు దూసి దుర్గారావు, సీఐటీయూ మండల కార్యదర్శి కాద రాము పాల్గొన్నారు.

యూరియాను పశువులకు దూరంగా ఉంచాలి

మక్కువ: పొలాలకు ఉపయోగించే యూరియాని పశువులకు దూరంగా ఉంచేలా జాగ్రత్త పడాలని మం డల పశువైద్యాధికారి కె.పొలందొర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియాని పంట పొలాలకు చల్లేటప్పుడు ఆ నీటిని పశువులు తాగకుండా రైతులు చూడాలని ఆయన సూచించారు. యూరియాతో కూడిన గడ్డిని పశువులు తింటే గంటలోనే చనిపోయే ఆస్కారం ఉందన్నారు. ప్రమాదవశాత్తూ తింటే వెంటనే చల్లని నీరు తాగించి సమీప పశువైద్య సిబ్బందికి తెలియజేసి చికిత్స అందించాలన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

వీరఘట్టం: మండలంలోని కిమ్మి గ్రామ సమీపంలో పంట పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. ప్రమాదం జరిగినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ ఆపడానికి వీలు లేకుండా ఉంది. అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా..

పీహెచ్‌సీలకు వైద్యులు గైర్హాజరు

భామిని: జీవో నెంబరు 85ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమానికి పీహెచ్‌సీల వైద్యులు బయలుదేరారు. ఈ మేరకు భామిని, బత్తిలి, బాలేరు పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు గైర్హాజరవుతున్నట్టు బాలేరు వైద్యాధికారి జి దీపిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

యోగాసన పోటీల్లో రూపవతి ప్రతిభ

సీతానగరం: బూర్జ ఆయుర్వేద ఆసుపత్రి ఆయూష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రంలో యోగా శిక్షకురాలుగా పని చేస్తున్న ఎం.రూపవతి రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో మూడో స్థానం కైవసం చేసుకున్నారని ఆయూష్ వైద్యురాలు టి.హేమాక్షి తెలిపారు. ఈసందర్భంగా రూపవతికి హేమాక్షితో పాటు గ్రామస్థులు సోమవారం అభినందనలు తెలిపారు.

నేడు విశ్వకర్మ మహాయజ్ఞం

గరుగుబిల్లి: గొట్టివలస గ్రామంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవిశ్వకర్మ మహాయజ్ఞం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని శ్రీఉమారామలింగేశ్వర విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు అజ్జరాపు కాశీవిశ్వేశ్వరరావు, కిరణంపల్లి తిరుపతిరావు, చింతాడ తవిటాచారి తెలిపారు. సోమవారం వీరు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్న దానం, సాయంత్రం స్వామివారి తిరువీధి నిర్వహిస్తామని చెప్పారు.

సీఐని కలిసిన సర్పంచ్‌ల సంఘం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట సీఐని సర్పంచ్‌ల సంఘ నాయకులు సోమవారం కలిశారు. గుమ్మలక్ష్మీపురంలోని ఆయన చాంబర్‌లో పుష్పగుచ్ఛం అందించారు. సీఐని కలిసిన వారిలో గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, లక్కగూడ, కొంవాడ, ఇరిడి, వంగర, నెల్లికిక్కువ, సీహెచ్ బిన్నిడి, వనకాబడి, చిన్నగీసాడ బాలేసు, రాయగడ జమ్ము సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

గుమ్మలక్ష్మీపురం: బ్రెయిన్ స్ట్రోక్‌తో వైజాగ్ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్యాంగారపువీధికి చెందిన సవదర కొండలరావుకు గుమ్మలక్ష్మీపురం హెల్పింగ్ హ్యాండ్స్, కాపు సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహకారం అందించారు. సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకరరావు, కాపు సంఘం నాయకులు, వర్తక, వైశ్య సంఘం నాయకులు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రూ.31వేలు విరాళాలు సేకరించి సోమవారం ఆ కుటుంబ సభ్యులకు అందించారు.

రేపు రక్తదాన శిబిరం

సీతంపేట రూరల్: సీతంపేట వైటీసీ కేంద్రంలో ఈనెల 18వ తేదీన మేము సైతం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కెగీతాంజలి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో నిర్వహించే ఈ మేము సైతం రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: స్థానిక ఎర్రన్నగుడి జంక్షన్‌లో ఎస్ఐ పి.రమేష్‌నాయుడు సోమవారం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది శంకర్, అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.